31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం,ఆగస్టు 07 ,2026 పేజీలు : 8

## ఏసిబి వలకు చిక్కిన ఆత్మకూర్ జిపిఓ



**చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, ఆగస్టు 6 :** మెట్ పల్లి మండలం ఆత్మకూర్ గ్రామంలో (జిపిఓ) గ్రామ పాలనా అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న రాజేష్ లంచం తీసుకుంటుండగా గురు వారం ఏసిబి అధికారులకు చిక్కాడు.అదే గ్రామానికి చెందిన రైతు పాస్ బుక్ లో తప్పుగా నమోదైన పేరు మార్పిడికి ద స్తు చేసుకోగా సరిచేసేందుకు బాధితుడు నుంచి రూ.5 వేల లంచం తీసుకుంటూ ఉండగా ఏసిబి అధికారులు పట్టుకున్నారు.ఈ మేరకు ఏసిబి డిఎస్పి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ బాధితుడు పిర్యాదు మేరకు పాస్ బుక్ లో పేరు మార్పిడి కోసం జిపిఓ రాజేష్ లంచం అడగటంతో బాధితుడు ఏసిబి అధికారు లను ఆశ్రయించగా జిపిఓ రాజేష్ ను వలపన్ని పట్టుకొని సంబంధిత ఫైల్ సీజ్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు తెలిపారు.

## మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల కోతను రద్దు చేయాలి

### జిఓ 1181 ఉపసంహరించుకోవాలని సీఎంకు జీవన్ రెడ్డి లేఖ



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 6:** తెలంగాణ రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, డ్రైవర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లతో సహా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాల్లో కోత విధించిన జిఓ నం.1181 ను తక్షణమే ఉపసంహరించుకోవాలని బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన సీఎం ఎ. రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో ఈ విషయాన్ని ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 30,945 మంది మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగు లు పారిశుద్ధ్యం, కార్యాలయ విధులు నిర్వహిస్తూ మున్సిపాలిటీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్నారని గుర్తు చేశారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అను గుణంగా వేతనాలు పెంచాల్సిన బదులు, వేతనాల్లో కోత విధించడం ఉద్యోగుల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల కోతతో ఉద్యోగులకు కుటుంబ పోషణ, విద్య, వైద్య ఖర్చులు భారంగా మారతాయని, ఇది పేదరికంలోకి నెట్టివేసే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం అని స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ జాగ్జిత్ సింగ్ 2017 కేసులో స్పష్టమైన ఉత్తర్వులు ఇచ్చినా, ప్రభుత్వం వాటిని ధిక్కరిస్తూ వేతనాల కోత విధించడం సరికాదన్నారు. ఇంటిగ్రేటెడ్ ఫైనాన్సియల్ మానేజ్మెంట్ సిస్టం ద్వారా వేతనాలను తగ్గించడం వల్ల ఉద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు, మార్కెట్ ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, జీవో 1181 ను రద్దు చేయాలని కోరారు.

## పనులు నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి

### జగిత్యాల కలెక్టర్ బి.సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల/ మల్యాల, ఆగస్టు 6 :** ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అన్నారు. జగిత్యాల జిల్లా పరిధిలోని పెగడపల్లి, మల్యాల, కొడిమ్యాల మండలాలకు సంయుక్తంగా ఏర్పాటు చేస్తున్న ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్ నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం మల్యాల మండల కేంద్రంలో పరిశీలిం చారు. ఈ సందర్భంగా యూనిట్ నిర్మా ణ పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పను లు నాణ్యతతో పాటు నిర్దేశిత గడువు లోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. యూనిట్ ఏర్పాటుకు అవ సరమైన యంత్రాల కొనుగోలు, నిర్వహణ విధానాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మార్గదర్శకాల మేరకు ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్‌లో బేలింగ్ మెషిన్, ష్రెడర్ మెషిన్, లిఫ్టింగ్ కార్ట్, వెయింగ్ మెషిన్ తదితర ఆధునిక పరికరాలను ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడు తూ మూడు మండలాలకు ఉమ్మడిగా ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు అవకాశం కలుగు తుందని అన్నారు. దీనివల్ల పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ పారిశుద్ధ్య మెరుగుద లతో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) లక్ష్యాల సాధనకు మరింత తోడ్పా టు అందుతుందని పేర్కొన్నారు. గ్రామా ల్లో ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ, వర్గీకరణ, రీసైక్లింగ్, రీసైక్లింగ్ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించి పరిశుభ్రమైన వాతా వరణాన్ని నెలకొల్పేందుకు ఈ యూ నిట్ కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపారు. అనం తరం మల్యాల మండలం మానాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న వివో భవ నాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం పనులు దాదాపు పూర్తికాగా పూర్తి స్థాయి లో పనులు చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలన్నారు. తద్వారా మహిళల సంఘాల సభ్యులకు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి ఉపయోగకరం గా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్ర మంలో ఈఈ పిఆర్ లక్ష్మణ్ రావు, ఎంపిడివో స్వాతి, తహసీల్దార్ శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ లు, మహిళా సంఘం సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రౌడీ, హిస్టరీ షీటర్ల పై నిరంతర నిఘా ఉంచాలి

**-ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తూ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు**

**-జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 6 :** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి విఘాతం కలగకుండా రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు అధికారు లను ఆదేశించారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రౌడీ, హిస్టరీ, సస్పెక్ట్ షీట్ల నిర్వహణ, తరుచూ నేరాలకు పాల్పడే వ్యక్తులపై తీసుకుం టున్న చర్యలను సమీక్షించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రౌడీ షీట్లు, హిస్టరీ షీట్లలో ఉన్న వ్యక్తుల ప్రవర్తన, కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. శాంతిభద్రత లకు భంగం కలిగించే అవకాశమున్న వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అవసరమైన సందర్భాల్లో బైండోవర్ చర్యలు చేపట్టాలని ఆదేశిం చారు. పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడకుండా వారిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, ఆయా పోలీస్ స్టేషన్ పరిధిలా ని రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. రౌడీ, హిస్టరీ అనుమానాస్పద, అల్లర్లలో ప్రమేయం ఉన్నవారిని ప్రతి నెల పోలీస్ స్టేషన్ కు పిలిపించి వివరాలు తీసుకోవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపడం జరుగుతుందని శాంతియుత వాతావరణానికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, సీఐలు కరుణాకర్, సుధాకర్, రామ్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువయ్యే సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి

**చురకలు ప్రతినిధి,సిరిసిల్ల ఆగష్టు 06 :** రాజన్న సిరిసిల్ల జిల్లా పర్యటనలో భాగంగా గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి విచ్చేసిన రాజన్న జోన్-3 డీఐజీ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ గారికి జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే స్వాగతం పలికారు. అనంతరం గౌరవ వందనం స్వీకరించిన డీఐజీ కార్యాలయ పరిసరాలు, స్పెషల్ బ్రాంచ్, ఐటీ కోర్, డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (డీసీఆర్‌బీ) విభాగాలను పరిశీలించి, రికార్డుల నిర్వహణ, డిజిటల్ డేటా నిర్వహణ, సాంకేతిక వినియోగంపై ఆరా తీశారు.రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీసుల పనితీరు పట్ల రాజన్న జోన్-3 డీఐజీ శ్రీ సన్‌ప్రీత్ సింగ్ ఐపీఎస్ గారు సంతృప్తి వ్యక్తం చేశారు. -మిగతా 2లో





## కొత్తగట్టు "కాంగ్రెస్" గ్రామ శాఖ అధ్యక్షుడిగా కోరెం శ్రీధర్ రెడ్డి



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్టు 6 :** శంకరపట్నం మండలం కొత్తగట్టు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కోరెం శ్రీధర్ రెడ్డి ఎన్నికయ్యారు. మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఆదేశాల మేరకు కొత్త కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా శ్రీధర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా మంజుల లచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా రామగిరి ప్రశాంత్, కార్యదర్శిగా జానపట్ల సాగర్,పారిపల్లి లింగారెడ్డి,కోశాధికారిగా రామగిరి సుధాకర్ నియమితులయ్యారు . అలాగే యూత్ విభాగం అధ్యక్షుడిగా తీగల సాయి, ప్రధాన కార్యదర్శిగా మంజుల రమేష్, ఉపాధ్యక్షుడిగా రాబిన్ బాబు ఎన్నికయ్యారు. కొత్త కార్యవర్గాన్ని పలువురు ఆపిన అందించారు. తమ నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కు శ్రీధర్ రెడ్డి,కమిటీ సభ్యులు కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు.

## జగిత్యాలలో 7వ తరగతి బాలిక అదృశ్యం



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 6:** జగిత్యాల జిల్లా కేంద్రంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్న షేక్ అక్సా అనే మైనర్ బాలిక బుధవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోవడంతో కలకలం రేపింది. స్కూల్ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ నగేష్ తెలిపిన వివరాల ప్రకారం టీచర్లు క్లాస్‌లో బిజీగా ఉన్న సమయంలో బాలిక స్కూల్ నుంచి వెళ్లిపోయిందన్నారు. సీసీ కెమెరాల పరిశీలనలో బాలిక స్కూల్‌లోనే డ్రెస్ మార్చుకుని వెళ్లినట్లు గుర్తించారు. బుక్స్, బ్యాగ్, బూట్లు స్కూల్‌లోనే వదిలి వెళ్లిందన్నారు. బాలిక బ్యాగ్‌లో ఒక లెటర్ లభించింది. తల్లిదండ్రులతో ఇబ్బందిగా ఉంది.. చాలా మంది ఇబ్బంది పెడుతున్నారని ఆ లెటర్‌లో రాసిందని ప్రిన్సిపల్ తెలిపారు. వెంటనే విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బాలిక పక్కా ప్రణాళికతోనే వెళ్లిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. స్కూల్ నుంచి బాలిక వెళుతుంటే టీచర్లు ఏం చేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు, స్థానికులు టీచర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్కూల్లో భద్రతా చర్యలు సరిగా లేవని ఆరోపిస్తున్నారు.

## మెట్‌పల్లిలో శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి.

### -అధికారులపై ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ ఆగ్రహం



**చురకలు విలేకరి, మెట్‌పల్లి, ఆగస్టు 6 :** పట్టణ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించేది లేదని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ స్పష్టం చేశారు. మెట్‌పల్లి పట్టణంలోని బస్టాండ్ అవుట్‌గేట్ వద్ద నూతనంగా నిర్మిస్తున్న కల్వర్టు పనులను ఆయన గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ?కల్వర్టు నిర్మాణంలో జరుగుతున్న లోపాలను గమనించిన ఎమ్మెల్యే, అక్కడే ఉన్న మున్సిపల్ కమిషనర్ మరియు డీఈలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న ప్రధాన డ్రైనేజీ వెడల్పు సుమారు ఏడున్నర ఫీట్లు ఉంటే, దానికి బదులుగా కేవలం 3 ఫీట్ల పైపులు ఏర్పాటు చేయడం ఏంటని అధికారులను ప్రశ్నించారు. ఇలా చేయడం వల్ల వర్షాకాలంలో డ్రైనేజీ నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం ఏర్పడి, పట్టణ ప్రజలు వరద నీటితో ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. మొన్న మెట్‌పల్లి పెద్ద చెరువు విషయంలో తీసుకున్న నిర్లక్ష్య నిర్ణయాల వల్లే చెరువు దెబ్బతిందని, మళ్లీ డ్రైనేజీ నిర్మాణంలోనూ అదే తప్పు పునరావృతం చేయడం బాధాకరమన్నారు. డ్రైనేజీ సామర్థ్యానికి అనుగుణంగా పూర్తి స్థాయి పెద్ద పైపులు ఏర్పాటు చేసి, అవసరమైతే నిర్మాణ ప్రణాళికను వెంటనే సవరించాలి. తాత్కాలిక ప్యాచ్ వర్క్‌లు కాకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత పరిష్కారం చూపించేలా నాణ్యమైన నిర్మాణాలు చేపట్టాలి. ప్రజల సౌకర్యాలు, పట్టణ ప్రయోజనాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదు. నాణ్యత లేని పనులు జరిగితే బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని కోరుట్ల ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ హెచ్చరించారు.

# ప్రజలకు చేరువయ్యే సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలి

**మొదటి పేజీ తరువాయి...**ఈ సందర్భంగా జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి జిల్లా పోలీసింగ్ వ్యవస్థ, శాం తిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ చర్యలు, ప్రజా భద్రత, దర్యాప్తు ప్రమా ణాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, సైబర్ నేరాల నివారణ, పెండింగ్ కేసుల పురోగతి, కమ్యూనిటీ పోలీసింగ్, ప్రజల కు అందిస్తున్న పోలీసు సేవలపై సమ గ్రంగా సమీక్షించారు.ముందుగా జిల్లా ఎస్పీ డీఐజీకి పవర్‌పాయింట్ ప్రజెంటే షన్ ద్వారా సమగ్రంగా జిల్లా భౌగోళిక స్వరూపం, జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలు, నేర నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, సైబర్ నేరాల నివారణ, రోడ్డు ప్రమాదాల నివా రణకు తీసుకుంటున్న చర్యలు సంక్షేమ కార్యక్రమాలు తదితర అంశాలను వివ రించారు.ఈసందర్భంగా డిఐజి మాటా డుతూ... ప్రజలకు మరింత చేరువయ్యే విధంగా పారదర్శక, జవాబుదారీతనం కలిగిన సమర్థవంతమైన పోలీసింగ్ అందించాలని, ప్రతి ఫిర్యాదుపై సత్వర స్పందనతో బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని డిఐజి అధికారులను ఆదేశించారు. నేరాల నియంత్రణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు.జిల్లాలో నమోదవుతున్న దొంగతనం కేసుల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించి కేసులను త్వరితగతిన ఛేదించాలని సూచించారు. నమోదైన కేసుల్లో నిందితులకు శిక్షలు పడే శాతాన్ని మరింత పెంచేలా పటిష్ఠమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణపై దృష్టి సారించాలని ఆదేశించారు.జిల్లాలో కన్విక్షన్ రేటు మెరుగ్గా ఉండటం అభినందనీయమని పేర్కొంటూ, అందుకు కృషి చేసిన జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారు.కోర్టు మానిటరింగ్ బృందం ప్రతి కేసును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, విచారణ సమయంలో సాక్షులు తప్పనిసరిగా కోర్టుకు హాజరయ్యేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.జిల్లాలో అధికంగా నమోదవుతున్న సైబర్ నేరాలను విశ్లేషించి, వాటిపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అలాగే "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సీసీ కెమెరాల ఏర్పాటును విస్తృతంగా ప్రోత్సహించాలని, ప్రతి గ్రామంలో గ్రామ సర్పంచ్‌లు మరియు ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి కనీసం 5 నుంచి 8 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.వాహనాల తనిఖీల మయంలో పెండింగ్ ట్రాఫిక్ చలాన్లపై వాహనదారులకు అవగాహన కల్పించి, వాటిని వెంటనే చెల్లించేలా ప్రోత్సహించాలని తెలిపారు.ప్రతి పోలీసు అధికారి తన పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల పూర్తి వివరాలపై అవగాహన కలిగి ఉండాలని, పెట్రోలింగ్ సమయంలో రౌడీషీటర్లు, హిస్టరీషీటర్లు, అనుమానిత వ్యక్తులను తప్పనిసరిగా తనిఖీ చేస్తూ వారి ప్రస్తుత కార్యకలాపాలపై నిఘా ఉంచాలని ఆదేశించారు. అలాగే నమోదయ్యే ప్రతి కేసును సీసీటీఎన్ఎస్ (జజుచీూ)లో నిర్దేశిత సమయంలోనే నమోదు చేసి అప్లోడ్ చేయాలని సూచించారు.జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనకు ఉక్కుపాదం మోపాలని, గంజాయి సేవించే వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించడంతో పాటు వారికి అవగాహన కల్పించాలని తెలిపారు. అవసరమైతే వారిని డీ-అడిక్షన్ సెంటర్లకు తరలించి సన్మార్గంలో నడిపించే చర్యలు చేపట్టాలని సూచించారు. స్వచ్ఛందంగా గంజాయి వినియోగాన్ని మానేసి డీ-అడిక్షన్ సెంటర్‌లో చికిత్స పొందేందుకు ముందుకు వచ్చే వారిపై నమోదైన కేసుల ఉపసంహరణకు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఐజీ గారు ఆదేశించారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలో పోలీసు అధికారులు, సిబ్బంది వినియోగార్థం నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి వాటర్ ప్లాంట్‌ను డిఐజి సన్ ప్రీత్ సింగ్ గారు ప్రారంభించారు.ఈసమావేశంలో డిఎస్పీ లు శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐలు, ఆర్.ఐ లు, ఎస్.ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# జయశంకర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం : ఎస్పీ



**చురకలు ప్రతినిధి నిర్మల్, ఆగష్టు, 06 :** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త, ఆర్థికవేత్త, ఉద్యమకారుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా నివాళు లర్పించారు. ఎస్పీ.జానకి షర్మిల ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు. అనంతరం జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది రెండు నిమిషాల మౌనం పాటించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసిన మహోన్నత వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ గారని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, ప్రాంతీయ అభివృద్ధి కోసం ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, ప్రజాసేవలో ఉన్న ప్రతి ఒక్కరూ ఆయన విలువలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్, ఏ.ఓ యూసఫ్ అలీ, మల్లారెడ్డి, సీఐ లు కృష్ణ, సత్యనారాయణ, సమ్మయ్య, మల్లేష్, ఆర్.ఐ లు రామక్రిష్ణ, శ్రీపాల్, ఆర్.ఎస్సైలు మరియు మినిస్టీరియల్ సిబ్బంది మరియు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని ప్రొఫెసర్ జయశంకర్ కి ఘన నివాళులర్పించారు

# మానేరు తలాపున ఉన్నా.. అధిక ధరలకు ఇసుక విక్రయాలా?

**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్ట్ 6 :** హుజురాబాద్ నియోజకవర్గం నుండి మానేరు ప్రవహిస్తున్నప్పటికీ.. ఇసుక క్వారీలు ఉన్నప్పటికీ.. సామాన్యులకు గృహ నిర్మాణాలకు ఉపయోగపడే ఇసుకను రూ.7,500 కు విక్రయించడం దారుణమని, అలాగే యూరియాను మొబైల్ యాప్ ల ద్వారా కాకుండా నేరుగా రైతులకు దుకాణాల వద్ద అందజేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి డిమాండ్ చేశారు.హుజురాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులతో విస్తృత స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో ఇసుక కొరతతో ప్రజలు, నిర్మాణదారులు అలాగే ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఐదు మండలాలు, రెండు పట్టణాల పరిధిలో స్థానిక అవసరాల కోసం ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించేందుకు అనుమతులు ఇవ్వాలని ఆర్డీవోను కోరారు. నియోజకవర్గం దాటి ఇసుకను అక్రమంగా తరలించే ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆన్ లైన్ వ్యవస్థలో ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం రెండు నిమిషాలు కూడా అందుబాటులో ఉండటం లేదని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే అన్నారు. మార్కెట్‌లో రూ.1,500కు లభించాల్సిన ఇసుకను రూ.7,500 వరకు అధిక ధరలకు విక్రయిస్తున్నారన్నారు. యాప్ ద్వారా యూరియా కోసం రైతులను ఇబ్బంది పెట్టకుండా, నేరుగా షాపుల వద్దనే యూరియా అందించే విధానం అమలు చేయాలని కోరారు. రైతులకు అవసర మైన యూరియా అందుబాటులో ఉండే లా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

## తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహిస్తున్న వరి వంగడాలు



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, ఆగస్ట్ 06 :** తెలంగాణ ప్రభుత్వం వానాకాలం 2026లో 7రకాల ప్రాధాన్య వరి రకాల సాగును ప్రోత్సహిస్తోందని వెల్గటూర్ వ్యవసాయాధికారి సాయికిరణ్ రైతులకు తెలిపారు.బిపిటి 5204 సాంబమసూరి,ఆర్ఎన్ఆర్ 15048 సోనా తెలంగాణ, ఎచ్ఎంటి సోనా,జై శ్రీరామ్, కెఎన్ఎం 1638 కూనారం సన్నలు,డబ్ల్యూ జి ఎల్ 44 సిద్ధి,కెఎన్ఎం 7715 పైన పేర్కొన్న7రకాలవిత్తనాలు కొనుగో లు చేసారో తప్పని సరిగా విత్తన నమోదు చేసుకోవాలని, విత్తన డీలర్ వద్ద కొన్నట్లయితే డీలర్ వద్దకు వెళ్లి పాసుబుక్, మొబైల్ నంబర్,ఏ వెరైటీ,ఎన్ని బ్యాగ్స్ కొనుగోలుచేశారో నమోదు చేసు కువాలని తెలిపారు.రైతులు వీలైనం త త్వరగా వివరాలు నమోదు చేసుకొని ప్రభుత్వ రికార్డులో తమ సాగు నమోదును ఆగస్ట్ 10 లోపు పూర్తి చేయాలని కోరారు.ఎవరైనా రైతులు వ్యవసాయ పరిశోధన కేంద్రంనుంచి కొనుగోలుచేసినట్లయితే సంబంధిత పరిశోధన కేంద్రంకు వెళ్లి తమ విత్తనాలను నమోదు చేసు కోవాలని తెలిపారు.

## విద్యార్థులు ప్రొ.జయశంకర్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



**చురకలు విలేకరి, కొడిమ్యాల, ఆగస్టు 6 :** కొడిమ్యాల మండల కేంద్రం లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ పి. గోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడంలో ప్రొఫెసర్ జయశంకర్ పాత్ర మరువలేనిదని కొనియాడారు. ప్రొఫెసర్ జయశంకర్ ను విద్యార్థులు ఆదర్శం చేసుకోవాలని, నాయకత్వపు లక్షణాలను పెంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బండ్ల భాస్కర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ ఒక విద్యార్థి నాయకుడి నుండి ఒక ప్రొఫెసర్ గా ఎదిగి, తెలంగాణలో సాధించడానికి తన జీవితాన్ని త్యాగం చేశారని తెలిపారు. జయశంకర్ ను ఆదర్శంగా చేసుకోని చదువుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత



**చురకలు విలేకరి, రాయికల్, ఆగస్టు 6 :** సామాజిక సేవ ప్రతి ఒక్కరి బాధ్యత అని లయన్స్ క్లబ్ అధ్యక్షులు వాసం ప్రసాద్ అన్నారు.గురువారం రాయికల్ పట్టణంలోని ఓడ్డెర కాలనీ అంగన్వాడి కేంద్రానికి 8వ వార్డు కౌన్సిలర్ లయన్స్ క్లబ్ సభ్యులు పల్లికొండ గంగాధర్ ఒక సీలింగ్ ఫ్యాన్‌ను విరాళంగా అందజేశారు.చిన్నారులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. విద్యాసంస్థల అభివృద్ధికి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కోశాధికారి సుధవేణి మురళి,క్లబ్ సభ్యులు మచ్చ శేఖర్,దాసరి గంగాధర్,పులి రమేష్,సంకోజి అశోక్, అంగన్వాడి ఉపాధ్యాయురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం



**చురకలు విలేకరి, ధర్మపురి, ఆగస్టు 6 :** తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సేవలు చిరస్మరణీయం అని ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య అన్నారు. గురువారం జయశంకర్ జయంతి ఘనంగా నిర్వహించారు. ధర్మపురి పురపాలక సంఘం కార్యాలయంలో,అదే విదంగా వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో,నంది చౌక్ వద్ద స్వర్ణకార సంఘము అద్వర్యం జయశంకర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి,మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య, స్వర్ణ కార సంఘం అధ్యక్షుడు సింహారాజు ప్రసాద్ లు ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ జీవితాంతం చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడి గా ఆయన చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ప్రతి ప్రజాప్రతినిధి ,ప్రతిఅధికారికి బాధ్యత అని అన్నారు .ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మామిళ్ల శ్రీనివాస్,కౌన్సిలర్లు అయ్యోరి వేణు గోపాల్,విరేవేణి నాగలక్ష్మి,సంగి ఆనంద్,చుక్క సంధ్య గారు, చిపిరిశెట్టి రాజేష్, ఒజ్జల లక్ష్మణ్ , మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు,స్వర్ణకార సంఘం నాయకులు ఉప్పుల రాకేష్, రంగు లక్ష్మీ నరహరి,కట్ట శ్రీవారి, రాజ మౌళి,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.



# జిల్లాలో అభివృద్ధి నిర్మాణ పనులను గడువులోగా పూర్తి చేయాలి

**-నాణ్యతతో కూడిన పనులకే ప్రాధాన్యం ఇవ్వాలి**

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 6 :** జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ భవనాలు, విలేజ్ ఆర్గనైజేషన్ భవనాలు, అంగన్వాడీ కేంద్రాలు,కిచెన్ షెడ్స్, పాఠశాల మరుగుదొడ్లు,పాఠశాల భవనాలతో పాటు వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల పురోగతిని అధికారులుపవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్కు వివరించారు.సమీక్ష సందర్భంగా ప్రతి శాఖ పరిధిలో చేపట్టిన నిర్మాణ పనుల ప్రస్తుత స్థితి,పూర్తయిన పనులు, పెండింగ్లో ఉన్న పనుల వివరాలను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. పనుల అమలులో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని నిర్మాణ పనులను నిబంధనల ప్రకారం నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ శాఖ,అధికారులు పాల్గొన్నారు.

## చిన్నారులకు సామూహిక అన్నప్రాసన



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 6 :** తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా జగిత్యాల పట్టణంలోని 6వ వార్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు సామూహిక అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 6వ వార్డు కౌన్సిలర్ చీటి లక్ష్మీనారాయణ వార్డు అంగన్వాడీ టీచర్ హాజరై 6నెలలు నిండిన చిన్నారులకుఅన్నం తినిపించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన పిల్లల కోసం తల్లిపాలతో పాటు 6 నెలల తర్వాత తప్పనిసరిగా అనుబంధ ఆహారం ప్రారంభించాలన్నారు. పిల్లలు పుట్టిన గంటలోపు తల్లిపాలు ఇవ్వడం, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వల్ల పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. తల్లిపాలే ఉత్తమమైన ఆహారమని పిల్లలకు రెండు సంవత్సరాల వరకు పాలు ఇవ్వవచ్చని చెప్పారు. చిన్నారుల బరువు, ఎత్తు నమోదు చేసి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పిల్లలకు, తల్లులకు అందిస్తున్న సేవలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ , గర్భిణీ మహిళలు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళ్లు



**చురకలు విలేకరి, మల్యాల, ఆగస్టు 6 :** తెలంగాణ సిద్ధాంతకర్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా మల్యాల మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోనియా గాంధీ విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా మల్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పిన గొప్ప మేధావి అని పేర్కొన్నారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అదే విధంగా మల్యాల మండల కేంద్రంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కూడా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ కోసం ఆయన చేసిన త్యాగాలు, సేవలను సంఘం నాయకులు స్మరించుకున్నారు.ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఆగష్టు (06) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యామపూర్, ఫకీర్‌కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, వర్షకొండ, డబ్బ, అమ్మకపేట్, ఎర్రాపూర్, కేశాపూర్, కోజన్ కొత్తూర్ గ్రామ పంచాయతీలతో పాటు మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో గురువారం ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి అధికారులు, ప్రజాప్రతినిధులు నివాళు లర్పించారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ పలువురు నాయకులు, అధికారులు ఆయన సేవలను కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి సిద్ధాంతకర్తగా, ప్రత్యేక రాష్ట్ర సాధనకు మార్గదర్శిగా జయశంకర్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీఓ సిహెచ్ గణేష్,సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## సూర్య గ్లోబల్ స్కూల్‌లో ఘనంగా బోనాల జాతర




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 6 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని సూర్య గ్లోబల్ స్కూల్‌లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు డప్పు చప్పుళ్ల మధ్య అమ్మవారి వేషధారణలో నిర్వహించిన ప్రదర్శనలు, పులివేషాలతో చేసిన నృత్యాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు ప్రదర్శించిన కళారూపాలు పండుగ వాతావరణాన్ని తలపిస్తూ అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగలలో బోనాల పండుగ ఒక ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. విద్యార్థులకు మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు సహకరించిన తల్లిదండ్రులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు హరి చరణ్ రావు, రజిత రావు, మౌనిక రావు, సుమన్ రావు, హరిచరణ్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## సీనియర్ సిటీజెన్స్ ఆధ్వర్యంలో జయశంకర్ జయంతి వేడుకలు

**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 6 :** తెలంగాణ సిద్దాంత కర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి వేడుకలు తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కలెక్టరెట్ సమీపంలోని జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 10 మంది నిరుపేద వృద్ధులకు గొడుగులు, పాదరక్షలు హరి అశోక్ కుమార్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరీశెట్టి విశ్వనాథం, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు బొల్లం విజయ్ పి. అశోక్ రావ్,ఎం. డి. యాకూబ్, కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందము, ఎం. డి. ఎక్బాల్, సయ్యద్ యూసుఫ్, బి. రాజేశ్వర్, సింగం బాస్కర్, మానాల కిషన్, కరుణ, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలి

### -జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 6 :** ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాల సాధనకు కృషి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లో తెలంగాణరాష్ట్ర సాధనకు సిద్ధాంత కర్తగా,ఆత్మగౌరవ పోరాటానికి మార్గ దర్శిగా, ప్రజా చైతన్యానికి చిరస్మరణీయ ప్రతీకగా నిలిచిన ప్రొఫెసర్ డాక్టర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి భావజాల పునాది వేసిన మహనీయుడని అన్నారు. తెలంగాణ ప్రజలకు జరిగిన ప్రాంతీయ అసమానతలను గణాంకాలతో దేశానికి వివరించి ప్రత్యేక తెలంగాణ ఆవశ్యకతను చాటి చెప్పిన గొప్ప మేధావి అని కొనియాడారు. విద్యావేత్తగా, ఆర్థికవేత్తగా, ఉద్యమకారుడిగా,పరిపాలనా నిపుణుడిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతిగా సేవలందిస్తూ విద్యారంగంలోనూ విశిష్ట కృషి చేశారని తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ కలలుగన్న తెలంగాణ అంటే కేవలం ప్రత్యేక రాష్ట్రం మాత్రమే కాదని, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, గ్రామీణాభివృద్ధి, రైతు సంక్షేమం, నాణ్యమైన విద్య, యువతకు ఉపాధి, మహిళల సాధికారతతో కూడిన సమగ్ర అభివృద్ధి రాష్ట్రంగా తీర్చి దిద్దడమే ఆయన ఆశయమని పేర్కొన్నారు. నిరాడంబర జీవనం, నిస్వార్థ సేవ,ప్రజల పట్ల అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టి ప్రజాసేవకు అంకితభావంతో పని చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అన్నారు. అంతకు ముందు అధికారులు, ఉద్యోగులు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.ఎస్.లత,బి.రాజ గౌడ్,జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర సాధనకు జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు

### -జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, ఆగస్టు 6 :** తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ఆచార్య ప్రొ.కొత్తపల్లి జయశంకర్ అని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్పీ అశోక్ కుమార్, అడిషనల్ ఎస్పీ, డీఎస్పీలు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసి, ప్రత్యేక రాష్ట్ర సాధనకు మార్గం సుగమం చేసిన మహనీయుడు ఆచార్య జయశంకర్ అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప విద్యావేత్త, ఉద్యమ స్ఫూర్తి ప్రదాతగా చిరస్థాయిగా నిలిచి పోతారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ జయ శంకర్ జీవితం ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయమని ,ఆయన ఆశయాలను ఆచరణలో కొనసాగించడమే ఆయనకు అర్పించే నిజమైననివాళి అన్నారు . ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్,డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు,ఏఓ శశికళ,ఆర్ఐలు, సీఐలు,ఎస్ఐలు,మినిస్టీరియల్ సిబ్బంది, పోలీస్అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధి ప్రణాళిక గ్రామసభలు

### -స్వచ్ఛభారత్ సుచనలు, జలసిరి,ఎల్నినో ప్రభావంతో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం ఆగష్టు (06) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని వేముల కుర్తి, అమ్మకపేట్,ఫకిర్ కోండాపూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండ గ్రామలలో గురువారం ఎంపిడిఓ గణేష్, తహశీల్దార్ వరప్రసాద్,ఎఓ రాజ్ కుమార్, ఎంపీఓ రామకృష్ణ రాజుల అధ్యక్షతన గ్రామసభలు జరిగాయి. ఈసందర్భంగా అదికారులు మాట్లాడుతూ వాతావరణం లో ఎల్నినో ప్రభావం వల్ల ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఎర్పాటు చెసుకోవలని, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, స్వచ్ఛభారత్ సుచనలు, జలసిరి వంటి అంశాల పైన, ఎల్నినో ప్రభావం ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎస్ బి యం స్వచ్ఛ భారత్ లో గల ప్రతి గ్రామం లో నాలుగు రకలా చెత్త డబ్బలు తడి, పొడి,శానిటరీ చెత్త, ప్రత్యేక జాగ్రత్త అని ఉంటాయని వాటిని ఏ విధముగా వాడాలో ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేయాలవల్సిన పనుల వివరాలు చర్చించారు. జలసీరి వల్ల నీటిని భవిష్యత్తులో ఏ విధముగా ఉపయోగపడుతుందోవివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌ల పోరం మండల అధ్యక్షుడు కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి, సర్పంచుల పోరం మండల ఉపాధ్యక్షుడు తరి రామనుజం, బస శ్రావణ్, తోట రమేష్,మెగవత్ లత ,ఆరోగ్య సిబ్బంది ,విధ్యుత్ శాఖ సిబ్బంది, అంగన్వాడీ లు ,వివిధ శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### యమధర్మరాజుకు

# భరణి నక్షత్ర పూజలు



**చురకలు విలేకరి,ధర్మపురి, ఆగస్టు 6 :** శ్రీలక్ష్మీ నరసింహస్వామి అనుబంధ దేవాలయమైన శ్రీ యమధర్మరాజు వారి ఆలయంలో భరణి నక్షత్రం సందర్భంగా శ్రీ యమధర్మరాజు వారికి పురుష సూక్తం, శ్రీ లక్ష్మీ సూక్తం, మన్య సూక్తంతో, అభిషేకం ఆయుష్య హోమంతో ప్రత్యేక పూజలు హారతి మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం వేదపండితులు ఓంకార శర్మ, సూపరింటెండెంట్ అల్వాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వావిలాల తిరుపతి, అర్చకులు నేరెళ్ల సంతోష్ కుమార్, వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్, నేరెళ్ల విజయ్, అభిషేకం పురోహితులు బొజ్జ సంపత్ కుమార్, సిబ్బంది అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

# ప్రతి గడపకు సంక్షేమం - అభివృద్ధి ఫలాలు

**-ఇదే ప్రజాపాలన లక్ష్యం**
**-వొడితల ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ ఆగస్ట్ 6 :** ప్రజలకు ఉపయోగపడే సిఎంఆర్ఎఫ్ చెక్కులను ప్రజలకు త్వరగా అందజేస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి గడపకు సంక్షేమాన్ని,ప్రతి ఇంటికి అభివృద్ధి ఫలాలు ప్రజాపాలన ద్వారా ప్రజలకు చేరవేస్తున్నామని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం ఇల్లందకుంట మండల పరిధిలోని ఇల్లందకుంట మండలం, చిన్న కోమటిపల్లి, టేకుర్తి, బూజునూరు, రాచపల్లి, మల్లన్నపల్లి, శ్రీ రాముల పల్లి, కనగర్తి,లక్ష్మాజీ పల్లి, మల్యాల, వాగొడ్డు రామన్నపల్లి గ్రామాల్లో రూ. 8 లక్షల.. 24 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. అనంతరం ప్రణవ్ మాట్లాడుతూ తెప దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరిస్తున్నామని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందిస్తున్నామని, పార్టీ కార్యకర్తలకు, నాయకులకు ఇదే సూచన చేశామని తెలిపారు. ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి విషయంలో రాజీపడబోమని స్పష్టం చేశారు. శ్రీరాములపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు గృహప్రవేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట దేవాలయ ఛైర్మన్ రామారావు, మండల అధ్యక్షుడు పెద్ది కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్‌ను

# పరామర్శించిన బిజెపి నాయకులు

**-చదువుల్లో రాణిస్తున్న శ్రీనిధిని సన్మానించిన నాయకులు సునీల్ రెడ్డి, నారాయణరెడ్డి**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ (మంథని), ఆగస్టు 06 :** అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్ పట్టణంలోని ఆఫోలో రీచ్ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరి విశ్రాంతి తీసుకుంటున్న సీనియర్ జర్నలిస్టు ప్రజా క్రాంతి స్టాఫ్ రిపోర్టర్ పెండ్యాల రామ్ కుమార్ ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చల్ల నారాయణ రెడ్డి,ఇతర నాయకులు మంథని పట్టణం గాంధీచౌక్ లోని వారి ఇంటికి వెళ్లి గురువారం పరామర్శించారు.. రామ్ కుమార్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సూచించిన విధంగా మందులను ఖచ్చితమైన సమయాలలో వాడాలని సూచించారు, మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపీసీ చదివి అత్యధిక మార్కులు సాధించి ఎఫ్ సెట్లో15వేల ర్యాంక్ సాధించి మంథని జేఎన్టీయూ కళాశాలలోలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో ఏఐఎంఎల్ లో సీటు సాధించిన రామ్ కుమార్ కూతురు పెండ్యాల శ్రీనిధినిఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రు పట్ల సునీల్ రెడ్డి, చల్ల నారాయణ రెడ్డి లు ప్రత్యేకంగా అభినందించి శు భాకాంక్షలు తెలియజేసి శాలువాలతో వేరువేరుగా సన్మానించారు. నాలుగు సంవత్సరాల ఇంజనీరింగ్ కోర్స్ ను శ్రద్ధగా మంచి మార్కులతో చదివి మంచి ప్లేస్మెంట్ తో బయటికి రావాలని ఆశీర్వదించారు. బిజెపి స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కొండపాక సత్య ప్రకాష్,జిల్లా కౌన్సిల్ నెంబర్ బోగోజు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు సబ్బాని సంతోష్, జిల్లా కౌన్సిల్ సభ్యులు భాస్కర్ రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు ఆకుల అరుణ్, పట్టణ కార్యదర్శి పార్వతి విష్ణు, ఎస్టి మోర్చా అధ్యక్షులు హరీష్ రావు లతో అటు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నివాస స్థలాలు ఇప్పించాలని

# తహసిల్దార్‌కు జర్నలిస్టుల వినతి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగస్టు 07 :** ఎల్లారెడ్డిపేట మండల జర్నలిస్టులందరికీ నివాస స్థలాలు కేటాయించాలని కోరుతూ ఎల్లారెడ్డిపేట తహసిల్దార్ సుజాతకు జర్నలిస్టులు గురువారం వినతిపత్రం సమర్పించారు, జర్నలిస్టులకు నివాస స్థలాలు ఇప్పించాలని అప్పటి మంత్రి స్థానిక ఎమ్మెల్యే కేటీఆర్‌కు కలెక్టర్లకు ఆర్డీవోలకు తహసిల్దార్లకు పలుమార్లు వినతి పత్రములు ఇచ్చినా ఇప్పటివరకు ఎల్లారెడ్డిపేట జర్నలిస్టులకు నివాస స్థలాల కేటాయింపు జరగలేదని గంభీరావుపేట ముస్తాబాద్ సిరిసిల్ల వేములవాడ తదితర మండలాలలో జర్నలిస్టులకు ప్రభుత్వం నివాస స్థలాలతో పాటు ఇల్లు మంజూరు చేయగావారు ఇల్లు నిర్మించుకున్నారని ఈ సందర్భంగా జర్నలిస్టులు తహసిల్దార్‌కు విన్నవించారు.ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సర్వే నెంబర్లతో కూడిన ప్రభుత్వ భూముల వివరాలను వారు తహసిల్దార్ కు అందజేశారు, ఎల్లారెడ్డిపేట మండల సీనియర్ జర్నలిస్టులు నిమ్మ బాలచందర్ రెడ్డి (సాక్షి) ఎదురుగట్ల ముత్తయ్య(మన తెలంగాణ) బండారిబాల్రెడ్డి (చురకలు) శ్యామంతుల అనిల్ (వి6 వెలుగు) ఓగ్గు బాలరాజు యాదవ్ (తెలంగాణ ప్రభ) కొండ్లెప్ జగదీష్ (ప్రజాపక్షం)ఎండి లతీఫ్ (జనం సాక్షి )చంద్రమోహన్ రెడ్డి (ఆంధ్రప్రభ) షరీఫ్ (సూర్య) శ్రీధర్ గౌడ్ (విజన్ ఆంధ్ర) తహసిల్దార్ సుజాతకు వినతి పత్రం అందజేశారు,

# తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



**-సర్పంచ్ దొమ్మాటి నర్సయ్య**

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట ఆగష్టు 06 :** ఎల్లారెడ్డి పేట మండలం నారాయణపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ , మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు దొమ్మాటి నర్సయ్య మాట్లాడుతూ బిడ్డకు తల్లి ముర్రిపాలు శ్రేష్ఠమైన ఆహారమని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థపై కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని, పిల్లల ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు అందించే పాలు, గుడ్లు మంచి పౌష్టికాహారంగా పనిచేస్తాయని తెలిపారు. చిన్నారులకు తప్పనిసరిగా బాలామృతం తినిపించాలని, దీని ద్వారా పిల్లల దేహదారుఢ్యం పెరుగుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ రేణుక, ఉపసర్పంచ్ మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి ఉషశ్రీ, అంగన్వాడీ కార్యకర్తలు తాళ్లపల్లి రేణుక, మేతె లక్ష్మి, అనసూయ, చిన్నారులు మరియు వారి తల్లులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 6 :** పెద్దపల్లి జిల్లా అంతర్గాన్ మండలంలో నీ సోమనపల్లి గ్రామంలో జిల్లా మహిళా సాధికారత కేంద్ర కోఆర్డినేటర్ దయా అరుణ మరియు పోషన్ అభియాన్ కోఆర్డినేటర్ కె అనిల్ కుమార్ లు గ్రామ సభ మరియు తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సేవల గురించి, టోల్ ఫ్రీ నెంబర్లు- 1098, 181, 14567, 155326, 112, 1908 ల గురించి మరియు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాల గురించి వివరించడం జరిగింది. లేబర్ కార్డు వినియోగం, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంట బాపు, ఉప సర్పంచ్ - సత్య నారాయణ, కోరోబార్ రాజలింగు, పంచాయతీ కార్యదర్శి - కిశోర్, వార్డు సభ్యులు , ఆశ వర్కర్, ఏ ఎన్ ఎం - రత్న, అంగన్వాడీ టీచర్ శశికళ, వి ఓఎ, గర్భిణీలు, బాలింతలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## దేశాయిపల్లిలో బీఎల్ఓలతో సమీక్ష సమావేశం



**చురకలు విలేఖరి వీణవంక, ఆగస్టు 6 :** వీణవంక మండల పరిధిలోని దేశాయిపల్లి గ్రామంలో సర్ కార్యక్రమం పూర్తిస్థాయిలో విజయవంతంగా పూర్తికావడంతో బీఎల్ఓలతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశం లో గ్రామ సర్పంచ్ యాసర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, సర్ కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన బీఎల్ఓలను అభినందించారు. ప్రజలకు సేవలు అందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గాలేటి సురేందర్ రెడ్డి, దాగు అశోక్ రెడ్డి,చింతలపురి సంపత్ రెడ్డి, ఏడెల్లి అభిలాష్ రెడ్డి, నల్ల కొండాల్ రెడ్డి, నల్లగొని శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే బిఎల్ఓ, బిల్ఎ లు చింతలపురి రమాదేవి, కాంపెల్లి లక్ష్మీప్రియతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది హాజరయ్యారు.

## ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట ఆగష్టు 06 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓం గాయత్రి స్వర్ణకార సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు సిరిగాద అశోక్ చారి, పాలోజు సతీష్ , ప్రధాన కార్యదర్శి శ్రీ రామోజీ ప్రవీణ్, క్యాషియర్ పాలోజు సంతోష్, సిరిగాధ కిషన్, సిరిగాధ ధర్మచారి, మర్రిపల్లి వేణు, శ్రీరామోజి శ్రీనివాస్, ఎర్రవెల్లి కృష్ణ, ఎర్రోజు దేవేందర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# అక్షర సేవలో 'అభినవ వాగనుశాసనుడు'..డాక్టర్ గొల్లపల్లి గణేష్

**-మాతృభాషకు సాంకేతిక తోరణం: 'తెలంగాణబడి' వెబ్‌సైట్‌తో విద్యా విప్లవం**

**-తెలుగు బోధనకు డిజిటల్ దిక్సూచి: 'తెలంగాణబడి'తో భాషా సేవలో డాక్టర్ గొల్లపల్లి గణేష్ అసమాన కృషి**





**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

ఆధునిక సమాచార సాంకేతిక విప్లవం సమస్త మానవ జీవన విధానాన్ని సుదూర మార్పులకు గురిచేసిన వేళ, విద్యా రంగం కూడా తన సరిహద్దులను సరికొత్తగా నిర్వచించుకుంటోంది. ఒకప్పుడు నాలుగు గోడల తరగతి గది, నల్లబల్ల, చేతిలోని పుస్తకానికే పరిమితమైన అభ్యసన ప్రక్రియ నేడు డిజిటల్ తెరలపై నవ వసంతాన్ని సంతరించుకుంది. ప్రపంచం నలుమూలల నుంచి జ్ఞానాన్ని ఆర్జించే అవకాశాలు అందుబాటులోకి వచ్చిన ఈ కంప్యూటర్ యుగంలో, మాతృభాషా బోధనను ఆధునీకరించి విద్యార్థులకు సులభతరం చేయడం అత్యంత ప్రాధాన్య అంశంగా మారింది. ఈ నూతన సవాలును స్వీకరించి, సంప్రదాయ భాషా సేవకు సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి అపూర్వ విజయాన్ని సాధించారు జగిత్యాల జిల్లా ధర్మపురికి చెందిన ఉపాధ్యాయుడు డాక్టర్ గొల్లపల్లి గణేష్. ధర్మపురి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా బోధకుడిగా సేవలందిస్తున్న ఆయన రూపొందించిన "తెలంగాణ బడి"ె(elanganabadi.in) వెబ్‌సైట్ నేడు రెండు తెలుగు రాష్ట్రాలలోని వేలాదిమంది విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఒక అక్షర నిధిగా, డిజిటల్ విద్యా దిక్సూచిగా విరాజిల్లుతోంది. తెలుగు భాషలోని సంక్లిష్టమైన వ్యాకరణాంశాలు,సంధులు, సమాసాలు, ఛందస్సు, అలంకారాలు మరియు ప్రాచీన పద్యాలను నవీన తరానికి అర్థమయ్యేలా బోధించడం ఉపాధ్యాయులకు నిరంతరం ఒక పెద్ద సవాలుగానే ఉంటూ వస్తోంది. ఈ అవసరాన్ని ముందే పసిగట్టిన డాక్టర్ గణేష్, విద్యార్థులలో అభ్యాసనం పట్ల ఆసక్తిని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆసరాగా చేసుకున్నారు. శారీరక వైకల్యం ఎదురైనప్పటికీ, దానిని ఏనాడూ తన కార్యాచరణకు అవరోధంగా భావించక, "సంకల్పం ఉంటే సాధించలేనిది ఏదీ లేదు" అని నిరూపించారు. పాఠశాల పనివేళలు పూర్తయిన అనంతరం కూడా రాత్రింబవళ్లు శ్రమించి, కంప్యూటర్ పరిజ్ఞానంపై ఉన్న పట్టుతో స్వయంగా వెబ్ డిజైనింగ్ నేర్చుకొని ఈ వినూత్న డిజిటల్ వేదికకు ప్రాణం పోశారు. తెలంగాణ రాష్ట్ర పాఠ్యపుస్తకాల రూపకల్పన సంస్థ (ఎస్‌సీఈఆర్టీ) నిర్దేశించిన నూతన విద్యా ప్రమాణాలకు అనుగుణంగా 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న సమగ్ర తెలుగు పాఠ్యాంశాలను ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు.ప్రతి పాఠానికి సరళమైన వ్యాఖ్యానం,పద్యాలకు పాదభంగాలు లేకుండా భావాలు,కవుల కాల ప్రామాణిక పరిచయాలు,కఠిన పదాలకు అర్థాలు, పర్యాయపదాలు, నానార్థాలు, జాతీయాలు, సామెతలు మరియు వ్యాకరణ విశేషాలను విపులంగా విశ్లేషించారు.అమూర్తమైన విషయాలను సముచితమైన చిత్రాలు, రంగుల గ్రాఫిక్స్, యానిమేషన్లు మరియు వీడియో పాఠాల రూపంలో మలచి విద్యార్థుల ముందుంచడం ఈ వెబ్‌సైట్ ప్రధాన బలం.దీనివల్ల కఠినమైన భాషాంశాలు కూడా సుబోధకంగా మారి,విద్యార్థులలో స్వయంకల్పిత అధ్యయన శక్తి పెరుగుతోంది.కేవలం కంటెంట్ అందించడమే కాకుండా, ఇంటరాక్టివ్ విద్యా విధానాన్ని ఈ వెబ్‌సైట్‌లో ప్రవేశపెట్టడం అత్యంత ప్రశంసనీయమైన అంశం.విద్యార్థులు పాఠం చదివిన వెంటనే తమ అవగాహనా మట్టాన్ని పరీక్షించుకునేందుకు వీలుగా అధ్యాయాల వారీగా అన్-లైన్ క్విజ్‌లను పొందుపరిచారు.జవాబు సమర్పించిన మరుక్షణమే ఫలితం, మార్కులు,సరైన వివరణలు తెలిసేలా వ్యవస్థను రూపొందించడం వల్ల విద్యార్థులు తమ లోపాలను తామే సరిదిద్దుకోగలుగుతున్నారు.వార్షిక పరీక్షలు,ప్రీ-ఫైనల్,యూనిట్ పరీక్షలతో పాటు ఎస్‌ఏ-1,ఎస్‌ఏ-2 ప్రాతిపదికన నమూనా ప్రశ్నపత్రాలను అందుబాటులో ఉంచడం పరీక్షల భయాన్ని పోగొడుతోంది.దీనికి తోడు రామాయణ, మహాభారత ఘట్టాలు, ప్రాచీన-ఆధునిక తెలుగు మహాకవుల జీవిత విశేషాలు, సాహిత్య విమర్శా గ్రంథాల సమాచారాన్ని చేర్చడంతో తెలంగాణ బడి వెబ్‌సైట్ ఒక సమగ్రవిజ్ఞాన సర్వస్వంగా భాసిల్లుతోంది. డిజిటల్ తరగతుల నిర్వహణలో స్మార్ట్ టీవీలు, ప్రొజెక్టర్లను వినియోగిస్తున్న ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఈ వెబ్‌సైట్ ఒక ఆపద్బాంధవుడిగా మారింది. పాఠ్యాంశాల ప్రదర్శనకు కావలసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్లు, వ్యాకరణ పట్టికలు, బోధనా అభ్యాసనా సామగ్రి ఉచితంగా లభిస్తుండటంతో బోధనా విధానం మరింత ప్రభావ వంతంగా మారింది. ఈ మొత్తం సమాచారాన్ని పైసా రుసుము లేకుండా ఉచితంగా అందించడం డాక్టర్ గణేష్ యొక్క నిష్కామ సేవానిరతికి, సామాజిక బాధ్యతకు ప్రత్యక్ష నిదర్శనం.ఆయన చేస్తున్న ఈ అక్షర యజ్ఞాన్ని రాష్ట్ర విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ సులోచనతో పాటు అనేకమంది ఉన్నతాధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విప్లవానికి ఇది ఒక నమూనా అని కొనియాడారు.డాక్టర్ గొల్లపల్లిగణేష్ ఉపాధ్యాయ వృత్తికే పరిమితం కాకుండా సామాజిక వికాసంలోనూ తనదైన ముద్ర వేశారు. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో నిరుపేద విద్యార్థులను గుర్తించి, సామాజిక మాధ్యమాల ద్వారా మిత్రుల సహకారాన్ని కూడగట్టి ఉచితంగా నోటు పుస్తకాలు, బ్యాగులు, స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేస్తున్నారు.కరోనా మహమ్మారి విజృంభించిన తీవ్ర క్లిష్టసమయంలోనూ జ్వరపీడిత కుటుంబాలకు స్వయంగా నిత్యావసరాలు, ఔషధాలు అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని భాషా వికాసానికి, సామాజిక శ్రేయస్సుకు సాధనంగా మలచుకున్న డాక్టర్ గణేష్ సేవలు నవసమాజ నిర్మాణంలో నేటి తరం ఉపాధ్యాయులకు దిశానిర్దేశం చేసే అక్షర చైతన్యమూర్తిగా చిరస్థాయిగా నిలిచిపోతాయి.

# తల్లిపాలు బిడ్డకు చాలా శ్రేష్టం

**-ఐసీడీఎస్ సూపర్వైజర్ కవితారాణి**



**చురకలు విలేకరి, జగిత్యాల, ఆగస్టు 6 :** తల్లిపాలు చంటి పిల్లలకు చాలా శ్రేష్టమని మహిళా శిశు సంక్షేమ శాఖ సూపర్ వైజర్ కవితరాణి స్పష్టం చేశారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1 నుండి 7 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాలను పురస్కరించుకొని జగిత్యాల మున్సిపల్ 3, 23వ వార్డుల పరిధిలో గురువారం తల్లిపాల అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.3వ వార్డు కౌన్సిలర్ రాగుల ప్రదీప్, 23వ వార్డు కౌన్సిలర్ సుంకేటి మమత రామకృష్ణారెడ్డిల అధ్యక్షతన, ఐసిడీ ఎస్ సూపర్వైజర్ కవిత రాణి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా 5 నెలల గర్భిణీకి శ్రీమంతం నిర్వహించారు. ఈ సందర్భంగా కవితరాణి మాట్లాడుతూ ముర్రుపాల ప్రాముఖ్యతను వివరిస్తూ, పుట్టిన గంటలోపు ఇచ్చే మొదటి పాలు బిడ్డకు మొదటి టీకాలా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంచుతుందని తెలిపారు.6 నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, దీనివల్ల తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం తగ్గుతుందని సూచించారు. 7 నెలల పిల్లలకు అంగన్వాడీలో ఇచ్చే బాలామృతం తప్పనిసరిగా తినిపించాలని, అందులో ఐరన్, విటమిన్లు, మినరల్స్ ఉంటాయని అన్నారు. ఆకుకూరలు, అయోడిన్, పప్పుధాన్యాలు తీసుకోవాలని గర్భిణులు, బాలింతలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ పవిత్ర, ఏఎన్ఎం మాదేశి శిరీష, ఆశా వర్కర్లు మంజుల, లావణ్య, లింక్ వర్కర్ పద్మ, ఆయా గంగజల, బాలింతలు, గర్భిణీలు, పిల్లలు,తదితరులు పాల్గొన్నారు.

## నూతన జీఎంకు సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 6 :** సింగరేణి సంస్థ రామగుండం రీజియన్ 2 కు జిఎం గా వచ్చిన లక్ష్మీపతి గౌడ్ ను ఘనంగా సన్మానించారు. బుధవారం రోజున కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సి ఎమ్ ఓ ఏ ఐ) అర్జీ-3 ఏపీఏ కమిటీ వారు, బదిలీ పై వచ్చి నూతనముగా అర్జీ -2 జీ ఎమ్ గా పదవి భాధ్యతలు చేపట్టిన తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షులు సి ఎమ్ ఓ ఏ ఐ సింగరేణి శాఖ వారిని శాలువా, బోకే తో ఘనముగా సన్మానించడం జరిగినది.ఈ సందర్భంగా సి ఎమ్ ఓ ఏ ఐ అర్జీ-3 ఏపీఏ అధ్యక్షులు కోల శ్రీనివాస్ మాట్లాడుతూ సింగరేణి అధికారులకు పే అఫ్లేడెషన్ అమలు పరిచేందుకు మరియు పి ఆర్ పి ని త్వరగా చెల్లించేందుకు కృషి చేయాలనీ అధికారుల సంఘం తరపున కోరడం జరిగినది.దీనికి బదులుగా తాళ్లపల్లి లక్ష్మీపతి గౌడ్ అధ్యక్షులు సి ఎమ్ ఓ ఏ ఐ ఎస్ సి సి ఎల్ మాట్లాడుతూ తప్పక అమలు జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడం జరిగినది.

## గుడ్ మార్నింగ్ స్కూల్‌లో బోనాల మహోత్సవం




**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ ఆగస్టు 6 :** గోదావరిఖని చంద్రశేఖర్ నగర్ లోని గుడ్ మార్నింగ్ గ్రామర్ స్కూల్ లో గురువారం బోనాల మహోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. బాలురు పోతరాజుల వేషధారణతో, బాలికలు నెత్తిన బోనాలతో, కోలాటం-నృత్యాలతో పాఠశాల నుండి రమేష్ నగర్ వరకు డీజే సౌండ్స్ తో శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్లు కొమ్ము స్వప్న-వేణు, కొటం సతీష్, మాజీ కార్పొరేటర్ బాల రాజ్ కుమార్ నెత్తిన బోనమెత్తారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు బాల్యం నుండే మన సంస్కృతి, సంప్రదాయాలపట్ల అవగాహన కలిగించడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పాఠశాల నిర్వాహకులను అభినందించారు. ఇంకా ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అదర్సండే సమ్మారావు, ప్రిన్సిపాల్ సమ్మిరెడ్డి, డైరెక్టర్ తిరుపతి రెడ్డితో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉచిత టీకాల పంపిణీ ప్రారంభం



**చురకలు విలేకరి, మెట్ పల్లి రూరల్, ఆగస్టు 6 :** మెట్‌పల్లి మండలంలోని ఆత్మకూర్ గ్రామంలో పశు వైద్య,సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత బ్లూ టంగ్ (నీలి నాలుక) వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని పశువైద్యధికారి డా.అశ్విని సమక్షంలో సర్పంచ్ చిట్యాల రాజారాం ప్రారంభించారు. వ్యాధి సోకిన జీవాల్లో లక్షణాలు అధిక జ్వరం, నాలుక వాపు వచ్చి తీవ్రమైన దశలో నీలం రంగులోకి మారడం,నోటిలో పుండ్లు ఏర్పడడం వల్ల మేత మేయలేక పోవడం మరియు ఇతర లక్షణాలు ఉంటాయని కావున ఆగస్టు 14 వరకు కొనసాగుతుందని ఈ ఉచిత కార్యక్రమాన్ని గొర్రెలకాపర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విడిసి చైర్మన్ గండ్ర సంపత్,వార్డు సభ్యులు, పశు వైద్య సిబ్బంది దిలీప్ రైతులు పాల్గొన్నారు.

# 20 నెలల్లో 150 జీసీసీలు.. 1.5 లక్షల ఉద్యోగాలు....

**-జేఎల్ఎల్ జీసీసీ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ ఆగస్టు 6 :** గత 20 నెల కాలంలో తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన 150 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ల (జీసీసీలు) ద్వారా 1.5 లక్షల మందికి ఉపాధి లభించిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారులి. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో జేఎల్ఎల్ (జే ఎల్ ఎల్) సంస్థ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్‌ను గురువారం నాడు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన ప్రాంతాలను గుర్తించి సిఫారసు చేసే సంస్థగా జేఎల్ఎల్‌కు ప్రత్యేక గుర్తింపు ఉంద న్నారు. అలాంటి సంస్థ హైదరాబాద్‌ను తన జీసీసీ కేంద్రంగా ఎంచుకోవడం తెలంగాణ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఐటీ కార్యకలాపాలు మార్పులకు లోనవుతున్న తరుణంలో, ఇన్నోవేషన్ ఆధారిత జీసీసీలు భవిష్యత్ ఉపాధికి ప్రధాన కేంద్రాలుగా అవతరిస్తున్నాయని చెప్పారు. కృత్రిమ మేధ (ఏఐ), ఆటోమేషన్ ప్రభావంతో సాంకేతిక రంగంలో మార్పులు వచ్చినా, జీసీసీల ప్రాధాన్యం ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశారు.తెలంగాణలో జీసీసీల వేగవంతమైన విస్తరణకు అత్యుత్తమ మౌలిక వసతులు,నైపుణ్యం కలిగిన మానవ వనరులు,పరిశ్రమలకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు ప్రధాన కారణాలన్నారు. హైదరాబాద్ నగర అభివృద్ధిలో ఔటర్ రింగ్ రోడ్ ఎంత కీలక పాత్ర పోషించిందో, ఇప్పుడు రీజినల్ రింగ్ రోడ్, ఏఐ సిటీ, భారత్ ఫ్యూచర్ సిటీ వంటి ప్రాజెక్టులు భవిష్యత్ పెట్టుబడులకు బలమైన పునాది వేస్తున్నాయని చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ,ఏఐ,డీప్‌టెక్,అధునాతన సాంకేతిక రంగాలకు అవసరమైన మానవ వనరులను రాష్ట్రంసిద్ధం చేస్తోందన్నారు.

**హైదరాబాద్‌కు 16% జాతీయ వాటా**

2024 నుంచి 2026 మధ్య దేశవ్యాప్తంగా జీసీసీల కార్యాలయ లీజింగ్‌లో హైదరాబాద్ వాటా 16 శాతంగా నమోదైందని మంత్రి తెలిపారు. అదే సమయంలో నగరంలో జరిగిన మొత్తం కార్యాలయ లీజింగ్‌లో జీసీసీల వాటా 42శాతానికి చేరు కోవడం హైదరాబాద్ ఆర్థిక వ్యవస్థలో వాటికి పెరుగుతున్న ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఆరోగ్య సంరక్షణ,బయోటెక్నాలజీ, సెమీకండక్టర్ రంగాలకు చెందిన జీసీసీల ఏర్పాటు లోనూ హైదరాబాద్ తొలి ఎంపికగా నిలుస్తోందని పేర్కొన్నారు. దీంతో ఐటీ కేంద్రంగా మాత్రమే కాకుండా, అత్యాధునిక సాంకేతిక రంగాల్లోనూ ప్రపంచ స్థాయి ఆవిష్కరణలకు వేదికగా నగరం ఎదుగుతోందన్నారు.

**1,600 మందికి ఉద్యోగాలు**

జేఎల్ఎల్ ఏర్పాటు చేసిన గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభిస్తే వచ్చే రెండేళ్లలో సుమారు 1,600 మందికి ఉపాధి లభించనుంది. ఫైనాన్స్, మానవ వనరులు,ప్రాజెక్టు నిర్వహణ, లీజ్ అడ్మినిస్ట్రేషన్,అడ్వాన్స్‌డ్ అనలిటిక్స్, టెక్నాలజీ ఆధారిత సేవలను ప్రపంచ వ్యాప్తంగా జేఎల్ఎల్ కార్యకలాపాలకు ఈ కేంద్రం సేవలను అందిస్తుంది. కార్యక్రమంలో జేఎల్ఎల్ ఇండియా సీఈఓ రాధా ధీర్, హైదరాబాద్ సీనియర్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ పట్నాయక్, గ్లోబల్ సర్వీస్ సెంటర్ హెడ్ ధీరజ్ పోప్లీ, ఐటీ శాఖ సలహాదారు సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీయు టెట్ స్టడీ మెటీరియల్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్, డీఈవో



**జగిత్యాల :** స్టేట్ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) స్టడీ మెటీరియల్ ను గౌరవ జిల్లా కలెక్టర్ శ్రీ సత్య ప్రసాద్ గారు, డీఈవో వేర్వేరుగా గురువారం తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. 2028 ఆగస్టు 31 లోపు ఉపాధ్యాయులందరూ టెట్ పాస్ అవడం తప్పనిసరి అని సుప్రీంకోర్టు రూలింగ్ ఇచ్చిన నేపథ్యంలో (ఎస్టీయు) ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిష్ణాతులైన ఉపాధ్యాయ విషయ నిపుణులతో మెటీరియల్ రూపొందించడం అభినందనీయమని జిల్లా విద్యాధికారి (డి ఈ ఓ) కే.రాము గారు అన్నారు. జిల్లాలో ఇంకా 522 మంది ఇన్ సర్వీసు ఉపాధ్యాయులు టెట్ ఉత్తీర్ణత కావలసి ఉందని, ఈ మెటీరియల్ ఉపాధ్యాయులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.ఉపాధ్యాయులందరూ ఉత్తీర్ణత సాధించాలని కలెక్టర్ , డీఈవో ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, పాలెపు శివరామకృష్ణ, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీర్గంచ రవీందర్, జిల్లా కోఆర్డినేటర్ చిప్ప సత్యనారాణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ మచ్చ రాజశేఖర్, వంశీ, కోరుట్ల మండల ప్రధాన కార్యదర్శి అన్నం మహేష్ ఉన్నారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తి





**-జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**చురకలు ప్రతినిధి సిరిసిల్ల, ఆగస్టు 06 :** ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయ కమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు.ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ గరిమ అగ్రవాల్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన సమయంలో ఉద్యమ స్ఫూర్తిని సమాజంలోని అన్ని వర్గాలకు చేరవేస్తూ, తెలంగాణ ఆకాంక్షను ప్రజల్లో చైతన్యంగా మలచడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు.సమాజం పట్ల నిబద్ధతతో అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని, ఆయన ఆశయాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం అని పేర్కొన్నారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మండల పరిషత్ కార్యాలయంలోనే ప్రజావాణి కార్యక్రమం

**- ప్రజలకు అందుబాటులో అన్ని శాఖల అధికారులు**
**- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి సోమవారం నిర్వహణ**
**- ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి**
**ఇబ్రహింపట్నం ఎంపీడీవో సిహెచ్ గణేష్**




**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం ఆగస్టు (06) :** ప్రజల సమస్యలను స్థానిక స్థాయిలోనే వేగవంతంగా పరిష్కరించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం ఇకపై ప్రతి సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి సిహెచ్ గణేష్ అన్నారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను ఒకే వేదికపై స్వీకరించి పరిష్కరించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ, ప్రతి సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యాశాఖ, వ్యవసాయశాఖ, ఉద్యానవనం, పశు సంవర్ధక, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులు హాజరై ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తారని,ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను అవసరమైన ఆధార పత్రాలతో సమర్పిస్తే,వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వివరించారు. భూ సమస్యలు, పెన్షన్లు, రేషన్ కార్డులు, విద్యుత్, తాగునీరు, రోడ్లు, పారిశుద్ధ్యం, సంక్షేమ పథకాలు, వ్యవసాయ సంబంధిత అంశాలు, ఇతర ప్రభుత్వ సేవలకు సంబంధించిన ఫిర్యాదులు, వినతులను ప్రజావాణి ద్వారా సమర్పించవచ్చన్నారు. మండలంలోని గోదూర్, తిమ్మాపూర్, తిమ్మాపూర్ తండా, యమాపూర్, ఫక్కీర్ కొండాపూర్, వేములకుర్తి, బర్దిపూర్, మూలరాంపూర్, ఎర్దండి, కోమటికొండాపూర్, వర్షకొండ, డబ్బా, ఎర్రాపూర్, అమ్మక్కపేట, ఇబ్రహీంపట్నం, కేశాపూర్, కోజన్ కొత్తూర్ గ్రామాలకు చెందిన ప్రజలుతమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

**ప్రతి వినతిని పారదర్శకంగా పరిశీలిస్తాం..**

ప్రజావాణి ద్వారా వచ్చిన ప్రతి వినతిని పారదర్శకంగా పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో సిహెచ్ గణేష్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతోనే పాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని, గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి కార్యక్రమం ఒక మంచి వేదికగా నిలుస్తుందని ఎంపిడిఓ అభిప్రాయపడ్డారు.

